సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 20 । జూలై । 2025



అధికారులే బినామీలుగా..!
పాల్వంచలో మున్సిపల్ పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వస్తున్నాయి. 8లో



రహదారులపై నెత్తుటిధారలు
అతి వేగం, మద్యం మత్తు, నిర్లక్ష్య డ్రైవింగ్‌తో జిల్లాలో రోడ్డు ప్రమాదాలు పెరిగి ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం
జిల్లాలో ఆదివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బ్రిడ్జి పనుల్లో నాణ్యత పరిశీలన



నాణ్యతను తనిఖీ చేస్తున్న అధికారులు

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని రెడ్డిగూడెం వద్ద ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద రూ.177 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పనులను రాష్ట్ర క్వాలిటీ మానిటరింగ్ అధికారి ఇ.దశరథం శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ డీఈ రామకృష్ణ, ఏఈలు శివలాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

15 మంది మైనింగ్ అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో 15 మంది మైనింగ్ అధికారులను బదిలీ చేస్తూ కార్పొరేట్ ఈఈ సెల్ హెచ్‌ఓడీ ఎ.జె. మురళీధర్ రావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో ఎనిమిది మంది డిప్యూటీ జీఎం స్థాయి అధికారులు, ఒకరు సూపరింటెండెంట్ ఆఫ్ మైన్స్ ఇంజనీర్, ఇద్దరు అడిషనల్ మేనేజర్లు, ఒక ఎస్ఈ, ముగ్గురు డిప్యూటీ ఎస్ఈ స్థాయి అధికారులు ఉన్నారు. వీరంతా ఈనెల 31వ తేదీ లోగా కేటాయించిన ఏరియాల్లో విధుల్లో చేరాలని సూచించారు.

నేరాల నివారణకు చర్యలు చేపట్టాలి

ఎస్పీ రోహిత్‌రాజు ఆదేశం



డీఎస్పీ కార్యాలయంలో ఫైళ్లను పరిశీలిస్తున్న ఎస్పీ

పాల్వంచ : సబ్ డివిజన్లలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నేరాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన పాల్వంచ డీఎస్పీ కార్యాలయాన్ని పరిశీలించారు. సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎలాంటి సమాచారం వచ్చినా అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించాలని, ఎప్పటికప్పుడు కేసులు పరిష్కరించాలని అన్నారు. అనంతరం కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ ఆర్.సతీష్‌కుమార్, పాల్వంచ, అశ్వారావుపేట సీఐలు సతీష్, నాగరాజు రెడ్డి, ఎస్ఐలు పాల్గొన్నారు.

పౌర సేవలు వేగవంతం చేయాలి



బూర్గంపాడు తహసీల్‌లో రికార్డులు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్

బూర్గంపాడు: ప్రజల అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, పౌర సేవలు వేగవంతం చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ సూచించారు. బూర్గంపాడు తహసీల్ కార్యాలయాన్ని శనివారం ఆయన సందర్శించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రాంతీయ ఆస్పత్రి, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో వైద్యుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అశ్వారావుపేటలోని ప్రాంతీయ ఆస్పత్రిలో మత్తు వైద్య నిపుణుడు, పాల్వంచ, చర్ల సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో గైనకాలజిస్టు పోస్టులు.. మొత్తం మూడు పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 26వ తేదీ లోగా తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

వివిధ రకాల మొక్కలతో ఏర్పాటుచేసిన వనం (ఇన్‌సెట్) శతభిష నక్షత్రానికి చెందిన అరటి మొక్క





అన్నీ ఒకేచోట..

నక్షత్రాలు, రాశులు, నవ గ్రహాల్లో ఒక్కొక్క దాని కోసం ఒక్కో మొక్కకు పూజలు చేయాలని భావించే వారు ఆ మొక్క ఎక్కడ ఉందో వెదకడం ప్రయాసగా మారుతోంది. ఈ నేపథ్యాన పాల్వంచ మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయ సన్నిధిలో అన్ని రకాల మొక్కలతో వనాన్ని తీర్చిదిద్దారు. ప్రతీ మొక్క వద్ద పేరు, అందుకు సంబంధించిన రాశి, నక్షత్రంతో కూడిన బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో ఇక్కడ పూజలు చేసేభక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

అమ్మవారి సన్నిధిలో.. నక్షత్ర వనం

పెద్దమ్మతల్లి ఆలయ ఆవరణలో 48 రకాల మొక్కలతో ఏర్పాటు

- నక్షత్రాలు, రాశులు, నవగ్రహాల పేరుతో నాటి, సంరక్షణ
- మొక్కలకు పూజలు చేస్తున్న భక్తులు

సండే స్పెషల్

హిందూ సంప్రదాయంలో ప్రకృతిలోని పూలు, మొక్కలను దేవతామూర్తుల ప్రతిరూపాలుగా భక్తులు కొలవడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే ప్రతీ పండుగలో వీటికి ప్రత్యేక స్థానం ఉంటుంది. భక్తులు తమ జన్మ నక్షత్రాల్లో ఏర్పడిన దోషాల నుంచి విముక్తి కోసం వాటికి ప్రతిరూపాలైన మొక్కలకు పూజలు చేయడం ద్వారా ఫలితం ఉంటుందని నమ్ముతారు. ఈ నేపథ్యాన భక్తుల మనోభావాలకు అనుగుణంగా పాల్వంచ మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయ సన్నిధిలో నక్షత్రాల ఆధారంగా వివిధ రకాల మొక్కలు నాటి వనంగా తీర్చిదిద్దారు. నక్షత్రాలు, రాశులు, నవగ్రహాల పేర్లతో మొక్కలు పెంచి సంరక్షిస్తుండడంతో భక్తులు పూజలు చేస్తున్నారు. –పాల్వంచరూరల్

నక్షత్రాల వారీగా మొక్కలు ఇవే..

హిందూ సంప్రదాయంలో జాతక రీత్యా ఒక్కో రాశి వారు నిర్దేశిత మొక్కకు పూజిస్తే శుభ ఫలితాలు గోచరిస్తాయని నమ్ముతారు. ఇందులో భాగంగా అశ్విని నక్షత్రం వారు అడ్డసరం, భరణి నక్షత్రం వారు ఉసిరి, కృతిక – మేడి, రోహిణి – నేరేడు, మృగశిర – సండ్ర, ఆరుద్ర – రేల, పునర్వసు – వెదురు లేదా గన్నేరు, పుష్యమి నక్షత్రం – రావి, ఆశ్లేష – నాగకేసరి, జ్యేష్ఠ – దేవదారు, అనూరాధ – పొగడ, విశాఖ – నాగమల్లి, స్వాతి – మద్ది, చిత్త – మారేడు, హస్త – కుంకుడు, ఉత్తర – జువ్వి, పుబ్బ – మోదుగు, మఖ – మర్రి, మూల – వేగిస, పూర్వాషాడ – నిమ్మ, నారింజ, ఉత్తరాషాడ – పనస, శ్రవణా నక్షత్రం – తెల్లజిల్లేడు, ధనిష్ఠ – జమ్మి, శతభిషం – అరటి, పూర్వాభాద్ర – మామిడి, ఉత్తరాభాద్ర – వేపతో పాటు రేవతి నక్షత్రం వారు విప్ప మొక్కకు పూజ చేస్తే మంచిదని నమ్మిక.

రాశులు, గ్రహాల వారీగా..

ఇక రాశుల వారీగా మేషం – ఎర్రచందనం, వృషభం – ఏడుకాయల పాయ, మిథునం – పనస, కర్కాటకం – మోదుగు, సింహం – కలిగట్టు, కన్య – మామిడి, తుల – పొగడ, వృశ్చికం – సండ్ర, ధనస్సు – రావి, మకరం – జిట్రేగు, కుంభం – జమ్మి, మీన రాశి వారు మర్రి మొక్కకు పూజలు చేయాలని పండితులు చెబుతున్నారు. అలాగే, నవగ్రహాల్లో సూర్యుడికి జిల్లేడు, చంద్రుడికి – మోదుగు, కుజుడికి – చండ్ర, బుధ గ్రహానికి – ఉత్తరేణి, గురు – రావి, శుక్ర – అరటి, శని – జమ్మి, రాహువు – గరిక, కేతువు కోసం దర్బ మొక్కలు పూజలు చేశాలని అంటున్నారు.

నేడు శాకాంబరీ దేవిగా పెద్దమ్మతల్లి..

పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువుదీరిన శ్రీకనక దుర్గ(పెద్దమ్మతల్లి) అమ్మవారిని ఆదివారం శాకాంబరీదేవిగా అలంకరించనున్నారు. ప్రతీ సంవత్సరం ఆషాఢ మాసంలో భక్తులు, దాతల సహకారంతో వివిధ రకాల పండ్లు, కూరగాయాలతో అమ్మవారిని ఇలా అలంకరించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

దోషాలు తొలగిపోతాయి..



నక్షత్రాలు, రాశులు, నవగ్రహాల్లో ఒక్కొక్కటి ప్రకృతిలోని మొక్కలతో ముడిపడి ఉంటాయి. జన్మనక్షత్రం దోషాలు తొలగిపోవాలంటే ఆయా చెట్ల చుట్టూ ప్రదక్షిణ చేయడం మంచిది. తద్వారా మంచి ఫలితాలు లభించడమే కాక దోషాల నుంచి విముక్తి కలుగుతుంది.
– పద్మనాభశర్మ, వేద పండితుడు, పెద్దమ్మతల్లి ఆలయం

కడియం నుంచి తెప్పించాం..



అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు రావిచెట్టుకు ఊయలలు కట్టి పూజిస్తుంటారు. ఇదే క్రమాన నక్షత్రాలు, రాశులు, గ్రహాలకు సంబంధించి 48 మొక్కలను ఏపీ రాష్ట్రంలోని కడియం నుంచి తీసుకొచ్చి నాటాం. ఈ వనంలో పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తున్నారు.
– ఎన్.రజనీకుమారి, ఈఓ, పెద్దమ్మగుడి

అభివృద్ధిలో భాగస్వాములను చేస్తాం

- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
- రేడియో కేంద్రం నుంచి ప్రత్యక్ష ప్రసారంలో కలెక్టర్ పాటిల్



ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి : జిల్లా అభివృద్ధిలో ప్రజలందరినీ భాగస్వాములను చేస్తామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ప్రజా సమస్యలపై వారితో నేరుగా మాట్లాడేందుకు శనివారం ఆయన కొత్తగూడెం ఆకాశవాణి కేంద్రం నుంచి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఫోన్ ద్వారా కలెక్టర్‌కు పలు సమస్యలు, అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. ముఖ్యంగా ఆరోగ్యం, విద్య, గ్రామీణ రహదారులు, తాగునీటి సమస్య, రేషన్ కార్డుల జారీ, పెన్షన్ పంపిణీలో జాప్యం తదితర అంశాలను ప్రస్తావించారు. వాటన్నింటినీ ఆసక్తిగా విన్న కలెక్టర్.. పలు సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఆకాశవాణి ద్వారా ప్రజలతో ప్రత్యక్ష ప్రసారంలో మాట్లాడటం మంచి అనుభూతి ఇచ్చిందని తెలిపారు. అందరి అభిప్రాయాలు, సూచనలు ఎంతో విలువైనవని అన్నారు. వ్యవసాయం వ్యర్థమని ఎవరూ భావించొద్దని, అది రైతుల జీవనాధారమని అన్నారు. యువత ఉద్యోగాల కోసం నిరీక్షించకుండా ఉన్న భూములను సద్వినియోగం చేసుకుంటూ ఆయిల్‌పామ్, మునగ సాగుతో పాటు చేపల పెంపకం వంటివి చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ హెడ్ కొలిపాక శంకర్ రావు, సిబ్బంది ప్రభాకర్, ఆనంద్, సుమన్, కోటేశ్వర రావు, కట్ట రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యాచరణ పాటించాలి..

గ్రామాల్లో పరిశుభ్రత పెంచేందుకు ఐదు రోజుల కార్యాచరణ అమల్లోకి తేవాలని కలెక్టర్ పాటిల్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై శనివారం ఆయన అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారంలో ఐదు రోజుల పాటు స్వచ్ఛ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, కార్యాలయాలు, విద్యాసంస్థల్లో సోమవారం పిచ్చి మొక్కలు తొలగించి, ప్రజలకు ఉపయోగపడే మొక్కలు నాటాలని ఆదేశించారు. మంగళవారం తడి – పొడి చెత్త వేరు చేయడంతో లాభాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, ఇకపై మంగళ,శుక్రవారాల్లోనే పొడి చెత్త సేకరించాలని తెలిపారు. బుధవారం ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలల్లో నిరుపయోగ వస్తువులు తొలగించాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలని అన్నారు. గురువారం డ్రెయినేజీల శుభ్రత, దోమల నివారణకు మందుల పిచికారీ, శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

కిచిడీలో పురుగులు..!

- తినకుండానే తరగతులకు వెళ్లిన గురుకుల కళాశాల విద్యార్థినులు
- విచారణకు ఆదేశించిన ఐటీడీఏ పీఓ



భద్రాచలం గురుకుల కళాశాలలో పురుగులు వచ్చిన కిచిడీని చూపిస్తున్న విద్యార్థినులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం వడ్డించే కిచిడీలో పురుగులు కనిపించడంతో విద్యార్థినులు ఆందోళన చేశారు. అల్పాహారం తినకుండానే తరగతి గదిలోకి వెళ్లారు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంతోనే పురుగు పట్టిన బియ్యంతో వంట చేస్తున్నారని, గత మూడు రోజులుగా ఇలాగే చేస్తుండగా ప్రిన్సిపాల్‌కు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. ఈ కళాశాలలో సుమారు 600 మంది విద్యార్థినులం ఉన్నామని, మూడు రోజులుగా ఆకలితో అలమటిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, ఈ విషయం తెలియగానే ఐటీడీఏ పీఓ రాహుల్ విచారణకు ఆదేశించారు. పూర్తిస్థాయిలో పరిశీలన చేపట్టి నివేదిక అందించాలని విచారణాధికారిగా నియమించిన ఆర్సీఓకు సూచించారు. బాలికలకు నాణ్యమైన ఆహారం అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా, పురుగులు వచ్చిన బియ్యాన్ని ప్రిన్సిపాల్ గుట్టుచప్పుడు కాకుండా జీసీసీ గోడౌన్‌కు పంపించారు. అయితే, విద్యార్థినులు ఆకలితో ఇబ్బంది పడకుండా బిస్కట్లు అందించామని, పురుగుపట్టిన బియ్యాన్ని గోడౌన్‌కు తరలించి మంచి బియ్యం తెప్పిస్తున్నామని ఆ తర్వాత పీఓ రాహుల్ ప్రకటించారు.

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



ద్రాక్షారామంలో రామయ్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం/భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి మూలమూర్తులకు శనివారం సువర్ణ తులసీ అర్చన చేశారు. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ద్రాక్షారామంలో రామయ్య కల్యాణం..

ఏపీలోని కోనసీమ జిల్లా ద్రాక్షారామం ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో భద్రాద్రి రామయ్య కల్యాణ మహోత్సవాన్ని శనివారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కల్యాణ వేడుకకు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి హాజరై భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పీఆర్ఓ సాయి బాబు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

రామయ్య సన్నిధిలో ఏపీ కమిషనర్..

శ్రీ సీతారామ చంద్ర స్వామి వారిని అమరావతి సెక్రటేరియెట్ ఆర్అండ్‌బీ కమిషనర్ రామసుందర్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి శనివారం దర్శించుకున్నారు. శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఉపాలయంలో పండితులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

- అసత్య ప్రచారంతోనే విక్రయ కేంద్రాలలో రైతుల రద్దీ
- గోదాముల్లో 6,200 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నాయి
- డీఏఓ బాబూరావు వెల్లడి



నానో యూరియాతో ప్రయోజనాలను వివరిస్తున్న బాబూరావు

ఇల్లెందురూరల్ : జిల్లాలో యూరియా కొరత లేదని, రైతుల అవసరాలకు అనుగుణంగా సరఫరా చేస్తున్నామని జిల్లా వ్యవసాయశాఖ అధికారి బాబూరావు తెలిపారు. మండలంలోని కొమరారంలో ఏర్పాటుచేసిన యూరియా విక్రయ కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో సాగయ్యే ఆరు లక్షల ఎకరాలకు 37,300 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమని, జూన్ మొదటి వారం నుంచి ఇప్పటి వరకు 18,080 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందని వివరించారు. ఇందులో 11,800 మెట్రిక్ టన్నులు విక్రయించగా, జిల్లాలో ప్రస్తుతం 6,200 మె.ట. యూరియా నిల్వ ఉందని, రెండు రోజుల్లో మరో 10 వేల టన్నులు దిగుమతి అవుతుందని చెప్పారు. ఈ లెక్కన ప్రస్తుత సీజన్‌లో జిల్లాకు అవసరమైన యూరియాలో 50 శాతానికి మించి రవాణా చేశామని తెలిపారు. జిల్లాలోని 23 పీఏసీఎస్‌లకు నిత్యం 40 మెట్రిక్ టన్నుల చొప్పున యూరియా రవాణా అవుతోందని, ఇల్లెందుకు అదనంగా 40 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తున్నామని వివరించారు. రెండు రోజుల్లో చల్లసముద్రంలో మరో విక్రయ కేంద్రాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. గుళికల రూపంలో ఉన్న యూరియాకు బదులుగా ద్రవ రూపంలో ఉండే నానో యూరియాను వినియోగిస్తే అదనపు ప్రయోజనం ఉంటుందని, రైతులు ఆ యూరియాను పిచికారీ చేసి సత్ఫలితాలు పొందాలని సూచించారు. విక్రయ కేంద్రాల వద్ద బారులుదీరకుండా సంయమనం పాటిస్తే ప్రతీ రైతుకు అవసరమైనంత యూరియా విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, ఏడీఏ లాల్‌చంద్, ఏఓ సతీష్, పీఏసీఎస్ సీఈఓ హీరాలాల్ పాల్గొన్నారు.

గిరిజన ఇలవేల్పులపై అధ్యయనం

ఆలయాలను సందర్శించిన ఐటీడీఏ పీఓ



ఆళ్లపల్లి మండలం పెద్దూరులో కొమరం వంశీయులతో పీఓ రాహుల్

గుండాల : గిరిజనులు సంస్కృతి, సంప్రదాయాలతో నిర్వహిస్తున్న ఇలవేల్పుల పండుగలపై అధ్యయనం చేసి వారి చరిత్రను పుస్తక రూపంలో అందించేందుకు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో శనివారం ఆయన ఆళ్లపల్లి మండలంలోని పలు గిరిజన గ్రామాల్లో ఉన్న ఆలయాలను సందర్శించారు. పెద్దూరు గ్రామంలో కొమురం వంశీయులతో చర్చించారు. రెక్కల రామక్క జాతర ఎప్పుడు, ఎలా నిర్వహిస్తారని అడిగి తెలుసుకున్నారు. ఇంకా మండలంలో ఏయే గ్రామాల్లో జాతరలు జరుపుతారు.. ఇలవేల్పులు ఎలా అవతరించాయని ఆరా తీశారు. ఇప్పనపల్లిలో గొగ్గెల వారి ఇలవేల్పు, పెద్దూరులో కొమరం వంశీయుల ఇలవేల్పయిన రెక్కల రామక్క, నడిమిగూడెం పాయం వంశీయుల ఇలవేల్పు రణాసురుడు తదితరుల చరిత్రపై అధ్యయనం చేస్తామని చెప్పారు. గత మార్చిలో జరిగిన జాతరలకు తాను పని ఒత్తిడి కారణంగా రాలేకపోయానని తెలిపారు. ఆయన వెంట ఏటీడీఓ రాధమ్మ, ఐటీడీఏ మ్యూజియం ఇన్‌చార్జ్ కొండ్రు వీరస్వామి, రిటైర్డ్ హెచ్ఎం జగపతి, కొమరం రాంబాబు తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏజెన్సీలోని మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని పీఓ బి.రాహుల్ అన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులతో కలిసి పీహెచ్‌సీల పనితీరుపై సమీక్షించారు. భద్రాచలం, పాల్వంచ, చర్ల, మణుగూరు, ఇల్లెందు, బూర్గంపాడు, అశ్వారావుపేట పీహెచ్‌సీల్లో అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు వైద్యులను నియమించామని తెలిపారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో డయాలసిస్ చికిత్సలు, సాధారణ ప్రసవాలు చేయాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని, వరద ముంపు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీసీహెచ్ఎస్ రవిబాబు మాట్లాడుతూ.. చర్ల సీహెచ్‌సీలో త్వరలో ఆపరేషన్ థియేటర్ ప్రారంభిస్తామని, హాజరు కావాలని పీఓను కోరారు. సమావేశంలో భద్రాచలం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్ఎంఓ సంతోష్, యశోదా రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాజ్యాంగ హక్కుల కోసం పోరాడుదాం



మాట్లాడుతున్న తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య

ఇల్లెందు: రాజ్యాంగ హక్కుల అమలు కోసం పోరాడుదామని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య తెలిపారు. శనివారం ఇల్లెందులో నిర్వహించిన అరుణోదయ రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అరుణోదయ కళాకారులు గళమెత్తాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు వేణు, ఉదయగిరి, రాజన్న, వెంకన్న, చిరంజీవి, జ్యోతి, స్వప్న, రాజన్న, లక్ష్మక్క, అభిగ్నో, శ్రీకాంత్, కిషన్, ఉమేష్, హరీష్, నాగమల్లు, కాంతారావు, కొండలరావు, కొండన్న, ఎన్డీ నేతలు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

జూలూరుపాడు: స్థానిక కేజీబీవీలో ఖాళీగా ఉన్న రెండు టీచింగ్ పోస్టు(గెస్ట్ ఫ్యాకల్టీ)ల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కేజీబీవీ ఎస్‌ఓ పద్మజ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ.. సీఆర్‌టీ – ఇంగ్లిష్, పీజీసీఆర్‌టీ – జువాలజీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. అర్హులైన వారు ఆధార్ జిరాక్స్‌ను దరఖాస్తుకు జతచేసి 20వ తేదీ సాయంత్రం 4 గంటల లోగా కళాశాలలో దరఖాస్తులు అందించాలని తెలిపారు. సీఆర్‌టీ – ఇంగ్లిష్ పోస్టుకు రూ.18,000, పీజీసీఆర్‌టీ – జువాలజీ పోస్టుకు రూ.23 వేల వేతనం ఉంటుందన్నారు.

ఆ సీఐ వ్యవహారంపై విచారణ

ఖమ్మంక్రైం: ఖమ్మంలో శుక్రవారం మాజీ మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీఆర్‌బీ సీఐ హడావుడి చేసిన అంశంపై పత్రికల్లో కథనాలు రావడం పోలీస్ శాఖలో చర్చకు దారి తీసింది. సదరు సీఐ వ్యవహారశైలిపై శాఖాపరంగా విచారణ మొదలుపెట్టినట్లు తెలిసింది. ఆయన తీరుపై నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించినట్లు సమాచారం. ఈమేరకు భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీ, ఖమ్మం పోలీస్ కమిషనర్ వేర్వేరుగా నివేదికలు ఇవ్వగా, సీఐకి భద్రాద్రి ఎస్పీ మెమో జారీ చేసినట్లు తెలిసింది.

పోక్సో బాధితులకు అండగా ఉంటాం

పాల్వంచ: పోక్సో బాధితులకు అండగా ఉంటామని భరోసా సెంటర్ ఎస్‌ఐ చల్లా అరుణ అన్నారు. శనివారం కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో పోక్సో కేసులు, బాలికల సాధికారత, హక్కులు, భరోసా సేవలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మానసిక, శారీరక ఇబ్బందులకు గురిచేస్తే తమకు సమాచారం ఇవ్వాలని విద్యార్థినులకు సూచించారు. భరోసా సెంటర్ అందుబాటులో ఉండి, అండగా నిలబడుతుందన్నారు. కార్యక్రమంలో అంబికా, అనూష, తులసి తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికుడి గుర్తింపు

చండ్రుగొండ : ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా చండ్రుగొండలో శనివారం నిర్వహించిన స్పెషల్‌డ్రైవ్‌లో ఓ మెకానిక్‌షెడ్‌లో పనిచేస్తున్న బాలకార్మికుడిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. సహాయ కార్మిక శాఖాధికారి ఎండీ షర్ఫుద్దీన్, చండ్రుగొండ, కొత్తగూడెం ఎస్‌ఐలు శివరామకృష్ణ, విజయకుమారి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. మెకానిక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివరామకృష్ణ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

అన్నపురెడ్డిపల్లి (చండ్రుగొండ) : మండలంలోని కంపగూడెం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు శనివారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. రూ.20 వేల నగదు, బైక్, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఏడుగురిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: దాడి ఘటనలో ఏడుగురు వ్యక్తులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన ఓర్సు గణేష్, గండుగుల రాజు హైదరాబాద్‌లో నివాసం ఉంటూ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. చిట్టీ డబ్బులు ఇవ్వాల్సి ఉండగా రాజు భార్యకు గణేష్ ఫోన్ చేసి అడిగాడు. ఇటీవల ఇద్దరూ గ్రామానికి వచ్చారు. ఈ క్రమంలో తన భార్యకు ఫోన్ ఎందుకు చేశావంటూ శనివారం పంచాయితీ పెట్టారు. పంచాయితీకి పెద్ద మనుషులను తీసుకొచ్చేందుకు వెళ్లగా తనపై రాజుతోపాటు మరో ఆరుగురు కలిసి దాడి చేశారని గణేష్ ఫిర్యాదు చేశాడు. దీంతో దాడిచేసిన ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

రహదారులపై నెత్తుటిధారలు



- అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్లే రోడ్డు ప్రమాదాలు
- పలువురు మృత్యువాత, మరికొందరు గాయాలపాలు
- రోడ్డున పడుతున్న, ఆర్థికంగా చితికిపోతున్న కుటుంబాలు
- బ్లాక్ స్పాట్ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టినా తగ్గని ప్రమాదాలు

కొత్తగూడెంటౌన్: రోడ్లు రక్తమోడుతున్నాయి. అతివేగం, మద్యం మత్తులో, నిర్లక్ష్య డ్రైవింగ్‌తో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. తెల్లవారుజామున, రాత్రి వేళ్లలో, మూలమలుపుల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు భద్రతా చర్యలు తీసుకుంటున్నా, ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్నా ఆశించినమేర ఫలితాలు రావడంలేదు. బ్లాక్‌స్పాట్లను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా సూచికలు ఏర్పాటు చేస్తున్నామని పోలీస్ అధికారులు చెబుతున్నారు. జిల్లాలో 2024 నుంచి 2025 ఈ నెల 10వ తేదీ వరకు 722 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిల్లో 344 మంది మృతి చెందగా, 331 మంది తీవ్రంగా గాయపడ్డారు. మరో 535 మంది స్వల్ప గాయాలపాలయ్యారు. ఈ ఏడాది ఇప్పటివరకు 207 ప్రమాదాలు జరగ్గా, 95 మంది మృతి చెందారు. 194 మంది తీవ్రంగా గాయపడ్డారు.

మద్యం మత్తులో అధిక ప్రమాదాలు

జాతీయ, రాష్ట్రీయ రహదారులపై వాహనాలను అతివేగం, అజాగ్రత్తగా నడుపుతుండటంతో ప్రమాదాలకు జరుగుతున్నాయి. లారీలు, కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలు పరిమితికి మించిన వేగంతో వెళ్తున్నాయి. పలువురు మద్యం తాగి వాహనాలు నడుపుతున్నారు. దీంతో అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నా ప్రమాదాల సంఖ్య తగ్గడం లేదు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడినవారికి, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినవారికి జరిమానాలు విధించినా మార్పు రావడంలేదు. అయితే ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రాణనష్టంతోపాటు వైద్య ఖర్చులు

రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడుతున్నారు. మృతి చెందినవారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇంటి పెద్దదిక్కు కోల్పోతే పిల్లల చదువులు, పెళ్లిళ్లు కూడా ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయి. మరికొందరు గాయపడి వైకల్యం పొందుతున్నారు. తీవ్ర గాయాలపాలైనవారు చికిత్స కోసం రూ. వేల నుంచి రూ. లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. వాహనదారులు కూడా ప్రమాదాల బారిన పడకుండా, కుటుంబాలను కష్టాలపాలు చేయకుండాతగిన జాగ్రత్తలు తీసుకోవాలని అవసరం ఎంతైనా ఉంది.

జిల్లాలో జరిగిన కొన్ని ప్రమాదాల వివరాలు

- జనవరి 1న అశ్వారావుపేట మండలం గాండ్లగూడెంలో రెండు బైక్‌లు ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి.
- జనవరి 5న కొత్తగూడెంలోని రుద్రంపూర్ పార్కు వద్ద కారు, ద్విచక్ర వాహనం ఢీకొని ముగ్గురు యువకులకు గాయాలయ్యాయి.
- జనవరి 8న బూర్గంపాడు క్రాస్ రోడ్డు వద్ద ఆర్టీసీ అద్దె బస్సు, బైక్‌ను ఢీకొని కొత్తగూడేనికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు.
- ఏప్రిల్ 12న పాల్వంచలో రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందాడు.
- ఏప్రిల్ 12న ఇల్లెందు మండలం మర్రిగూడెం ప్రభుత్వ పాఠశాల వద్ద టాటా ఏస్ వాహనం, బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు.
- ఏప్రిల్ 14న రుద్రంపూర్ ధన్‌బాద్ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొని సింగరేణి కార్మిక సంఘం నాయకుడు రాసూరి శంకర్ మృత్యువాత పడ్డాడు.
- ఏప్రిల్ 16న దమ్మపేట మండలం గట్టాయిగూడెం వద్ద రెండు లారీలు ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి.
- మే 9న అశ్వాపురం సీతారాంపురం సమీపంలో లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు.

నివారణ చర్యలు తీసుకుంటున్నాం



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి. మద్యం తాగి, అతివేగంతో వాహనాలు నడపొద్దు. రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా అందరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై నిత్యం అవగాహన కల్పిస్తున్నాం. బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రమాద నివారణ చర్యలు చేపడుతున్నాం. –బి.రోహిత్‌రాజు, ఎస్పీ

నిలిచిన తపాలా సేవలు



ఖమ్మంగాంధీచౌక్: తపాలా నిర్వహణలో నూతన సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్న క్రమాన శనివారం నుంచి పలు సేవలను నిలిపివేశారు. ఐటీ–2.0 పేరిట నూతనంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌ను ఈనెల 22వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పోస్టాఫీసుల్లో అమలు చేయనున్నారు. ఇందుకోసం మార్పులు చేయాల్సి ఉండడంతో శనివారం, సోమవారం పలు విభాగాల్లో సేవలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో డిపాజిట్లు, విత్ డ్రాతో పాటుఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంకు(ఐపీపీబీ) సేవలే కాక ఆధార్ ఆధారంగా నగదు విత్ డ్రా నిలిచిపోయింది. సురక్షితంగా, వేగవంతమైన సేవలందించేలా తపాలా శాఖ దేశవ్యాప్తంగా పోస్టాఫీసుల్లో ఐటీ–2.0 సాఫ్ట్‌వేర్ అమలుకు సిద్ధమైన అధికారులు, రెండు రోజుల పాటు లావాదేవీల్లో అంతరాయం ఏర్పడుతుందని ముందుగానే ప్రకటించారు. ఈమేరకు శనివారం ఖమ్మం తపాలా డివిజన్ కార్యాలయం, డివిజన్ పరిధిలోని 10 సబ్ డివిజన్ కార్యాలయాలు, ఖమ్మం, కొత్తగూడెం, భద్రాచలం హెడ్ పోస్టాఫీసులే కాక 70 సబ్ పోస్టాఫీసులు, 750 బ్రాంచ్ పోస్టాఫీసుల్లో ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయి. తిరిగి 22వ తేదీ నుంచి అన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. కాగా, ఉత్తరాల బట్వాడా మాత్రం కొనసాగుతోందని వెల్లడించారు.

సైబర్ కేసు నమోదు

అశ్వారావుపేటరూరల్: రుణం పేరుతో నగదు కాజేసిన ఘటనపై పోలీసులు సైబర్ కేసు నమోదు చేశారు. ఎస్సై టీ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని మద్దికొండ గ్రామానికి చెందిన తాటి నాగరాజుకు ఈ నెల 15వ తేదీన 8961365421 నుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి రూ.3లక్షల లోన్‌కు అర్హత పొందారని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు కింద కొంత నగదు చెల్లిస్తే, రూ. 3 లక్షల రుణ నగదు మీ అకౌంట్లో జమ అవుతుందని నమ్మబలికారు. దీంతో నాగరాజు విడతల వారీగా రూ.57,025 చెల్లించాడు. ఇంకా డబ్బులు కట్టాలని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సైబర్ నేరం కింద కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అధికారులే బినామీలుగా..!

- పట్టణ పరిధిలో పలు అభివృద్ధి పనులు
- పాల్వంచ మున్సిపల్ డివిజన్‌లో అక్రమాలు?
- తీవ్ర చర్చనీయాంశంగా మారిన ఏసీబీ సోదాలు
- ప్రైవేట్ వ్యక్తులతో జరిపిన లావాదేవీలపై ఆరా



మున్సిపల్ కార్యాలయంలో తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు(ఫైల్)

పాల్వంచ: కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ డివిజన్‌లో అవినీతి, అక్రమాలు హెచ్చుమీరుతున్నాయి. పాలకవర్గం లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు ఇక్కడి అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. తాజాగా శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి శనివారం తెల్లవారుజామున ఆరు గంటల వరకు మరోసారి ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది.

ప్రైవేట్ ఉద్యోగులతో లావాదేవీలు

ఏసీబీకి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో తనిఖీలు చేపట్టగా, అనేక అక్రమాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. కీలక పనులను ప్రైవేట్, చిరు ఉద్యోగుల ముసుగులో అధికారులే చేస్తున్నట్లు తెలుస్తోంది. శానిటేషన్, వాటర్ సప్లై, పలు అభివృద్ధి పనులు, రిపేర్ల పేరుతో భారీగా దండుకున్నట్లు సమాచారం. టెండర్లు పిలవకుండా నామినేషన్ పద్ధతిలో నిర్వహించిన పనుల్లో అక్రమాలు జరిగినట్లు తెలుస్తోంది. ఒకరిద్దరి కాంట్రాక్టర్లకే పనులు దక్కేలా చేసి, అధికారులు బినామీలుగా ఉండి పనులు చేయించినట్లు సమాచారం. సర్టిఫికెట్ల మంజూరు, నిర్మాణాల అనుమతుల విషయంలోనూ అవకతవకలు జరిగినట్లు, ప్రైవేట్ ఉద్యోగులను అడ్డుపెట్టుకుని ముడుపులు దండుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ఓ ముఖ్యఅధికారి డ్రైవర్, ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు, మరో అధికారి ఫోన్ పే, గూగుల్ పే లావాదేవీలను పరిశీలించారు. డ్రైవర్, అధికారి ఫోన్ పేల ద్వారా అధిక మొత్తంలో లావాదేవీలు జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పెండింగ్ విషయంపై ఏసీబీ అధికారులు ఆరా తీశారు. కాగా కొందరు ఉద్యోగులు ఆధారాలు చిక్కకుండా ముడుపులు దండుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

తెల్లవారుజామువరకు తనిఖీలు

శుక్రవారం ఉదయం కార్యాలయాన్ని దిగ్బంధనం చేసిన ఏసీబీ అధికారులు శనివారం తెల్లవారుజామున ఆరు గంటల వరకు తనిఖీలు కొనసాగించారు. దీంతో కమిషనర్ కె.సుజాత, మేనేజర్, టీపీఓ, శానిటేషన్, రెవెన్యూ సిబ్బందితో పాటు, ఇతర సిబ్బంది రాత్రంతా కార్యాలయంలో ఉండిపోవాల్సి వచ్చింది. పారిశుద్ధ్య వాహనాలకు ఆయిల్ వాడకం, రిపేర్లు తదితర అంశాలను కూడా పరిశీలించారు. మున్సిపాలిటీకి ఖాతా ఉన్న కేఎస్‌ఎంలోని పెట్రోల్ బంక్‌కు అర్ధరాత్రి వెళ్లి బిల్లులను సైతం తనిఖీ చేశారు. తనిఖీల్లో ఏసీబీ అధికారులకు పలు ఆధారాలు లభించినట్లు తెలుస్తోంది. సోదాలపై ఏసీబీ డీఎస్పీ వై.రమేష్‌ను వివరణ కోరగా.. తాము సేకరించిన ఆధారాలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని, తనిఖీలు మళ్లీ ఎప్పుడైనా ఉండొచ్చని తెలిపారు.

ముదురుతున్న అటవీ భూ వివాదం

చర్ల: మండల పరిధిలోని మామిడిగూడెంలో అటవీ భూమి వివాదం ముదురుతోంది. దుమ్ముగూడెం ఫారెస్ట్ రేంజ్ పరిధి దేవరాపల్లి బీట్‌లో ఉన్న 65 సీ కంపార్ట్‌మెంట్‌లో గిరిజనులు, అటవీశాఖ అధికారుల మధ్య వివాదం చోటుచేసుకుంది. రెండు వారాల క్రితం కూడా పోడు రగడ నెలకొంది. తమ పత్తి పంటను అటవీశాఖ అధికారులు ట్రాక్టర్లతో దున్నివేశారని ఆరోపిస్తూ నాలుగు రోజుల క్రితం గిరిజనులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం అటవీ భూముల్లో ప్లాంటేషన్ పనులు చేపట్టేందుకు వచ్చిన అధికారులు, సిబ్బందిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల నడుమ తోపులాట జరగ్గా, అటవీశాఖ అధికారి ఒకరికి గాయాలయ్యాయి. తమపైనే దాడి జరిగిందని పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో చర్ల సీఐ రాజువర్మ ఇరువర్గాలతో చర్చించి సమస్యను వారం రోజుల్లోగా పరిష్కరించుకోవాలని సూచించారు. కాగా అటవీశాఖ అధికారులు, సిబ్బందిపై గ్రామస్తులు దాడి చేసి గాయపరచడంతో పాటు అటవీ భూములను ఆక్రమించేందుకు యత్నిస్తున్నారంటూ దేవరాపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ టి. నాగేశ్వరావు చేసిన ఫిర్యాదు చేయగా, రేంజ్ అధికారిణి కేసు నమోదు చేశారు. శనివారం కోర్టులో కేసును సబ్మిట్ చేశారు. అయితే రోజురోజుకూ ముదురుతున్న వివాదంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణం అడ్డగింత

సింగరేణి స్థలమంటూ అభ్యంతరం

ఇల్లెందురూరల్: సింగరేణి స్థలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపడుతున్నారంటూ శనివారం అధికారులు పనులను అడ్డుకున్నారు. తిలక్‌నగర్ గ్రామపంచాయతీకి చెందిన వాసం శ్రీనుకు గతంలో ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసింది. ఇంటి స్థలం కేటాయించి పట్టా అందించింది. ఆర్థిక సమస్యలతో అప్పుడు ఇల్లు నిర్మించుకోలేదు. ఆ పట్టాను జతచేసి తాజాగా దరఖాస్తు చేసుకోగా ఇందిరమ్మ కమిటీ, గెజిటెడ్ ర్యాంకు అధికారులు పరిశీలించారు. ఇంటి నిర్మాణానికి ఆమోదం తెలిపారు. దీంతో వాసం శ్రీను నిర్మాణ పనుల చేపట్టి బేస్‌మెంట్ వరకు పూర్తి చేశాడు. ఈ క్రమంలో వచ్చిన సింగరేణి అధికారులు నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ఇది సింగరేణి స్థలమని, ఇళ్లు నిర్మించొద్దని తెలిపారు. పట్టా, ఇతర ఆధారాలు ఉన్నతాధికారులకు చూపించి, వారు అనుమతిస్తేనే ఇంటిని నిర్మించుకోవాలని చెప్పారు. దీంతో లబ్ధిదారుడు ఇంటి నిర్మాణాన్ని అర్ధంతరంగా నిలిపివేశాడు.

మహిళ ఆత్మహత్య



విజయ (ఫైల్)

పాల్వంచ: భర్త వదిలేసి పోవడంతో మానసిక ఇబ్బందులు తాళలేక శనివారం ఓ మహిళ చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన గోకినపల్లి విజయ(38)ను భర్త 18 ఏళ్ల క్రితం వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో ఆమె ఇళ్లలో పనిచేసుకుంటూ కూతురు, కుమారుడిని సాకుతోంది. కొద్దిరోజుల నుంచి మతిస్థిమితం కోల్పోతోంది. రెండు రోజుల క్రితం ఆత్మహత్యకు యత్నించగా, కుటుంబ సభ్యులు సర్ది చెప్పారు. రోజులానే శనివారం ఉదయం ఇళ్లలో పనిచేసేందుకు వెళ్లి మధ్యాహ్నం వరకు ఇంటికి రాలేదు. దీంతో కూతురు శ్రీలేఖ, కుమారుడు శ్రీకాంత్, తల్లి సిద్దుల చుక్కమ్మ, తమ్ముడు రాంబాబులు వెతకగా, పాత పాల్వంచ చింతల చెర్వులో మృతదేహం లభ్యమైంది. పోలీసులకు సమాచారం ఇవ్వగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తమను అనాథలను చేసి వెళ్లిపోయావా అమ్మా.. అంటూ మృతదేహం వద్ద పిల్లలు రోదించిన తీరు అందరినీ కంటతడి పెట్టించింది.

హత్యాయత్నం ఘటనలో వ్యక్తి అరెస్ట్

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ వైన్‌షాప్‌లో శుక్రవారం రాత్రి క్యాషియర్‌పై పెట్రోల్ పోసిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వైన్‌షాప్‌లో అప్పు ఇవ్వలేదని గ్రామానికి చెందిన నంగునూరి దుర్గాప్రసాద్ మద్యం మత్తులో పెట్రోల్ బాటిల్‌తో హల్‌చల్ చేశాడు. మద్యం దుకాణం క్యాషియర్ తోట వేణుతోపాటు మరికొందరిపై పెట్రోల్ పోశాడు. అక్కడున్నవారు నిలువరించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దుర్గాప్రసాద్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

పుట్టిన రోజు నాడే అనంతలోకాలకు..

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆటో డ్రైవర్



జాన్ (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: పుట్టినరోజు నాడే ఓ ఆటో డ్రైవర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషాద ఘటన లక్ష్మీదేవిపల్లిలో శనివారం జరిగింది. కొత్తగూడెంలోని ప్యూన్ బస్తీకి చెందిన సుమో జాన్(50) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున కిరాయికి వెళ్లి వస్తుండగా ముర్రేడు బ్రిడ్జిపై డీసీఎం వ్యాన్ ఆటోను ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, శనివారం పుట్టినరోజు వేడుకలు జరిపేందుకు కుటుంబసభ్యులు సిద్ధమవుతున్న తరుణంలో జాన్ మృతి చెందడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొంది. భార్య, ముగ్గురు పిల్లలు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. లక్ష్మీదేవిపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాదానికి కారణమైన డీసీఎంను చుంచుపల్లి మండలం విద్యానగర్ కాలనీలో ఓ షాపింగ్ మాల్ వద్ద పార్క్ చేసి, డ్రైవర్ పరారైనట్లు పోలీసులు గుర్తించారు.

కాలువలో పడి ఆవు మృతి

జూలూరుపాడు: ఏన్కూర్ లింక్ కెనాల్‌లో ఆవు పడి మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. మండలంలోని వినోభానగర్‌కు చెందిన రైతు గంగావత్ హచ్చా పశువులను మేతకు ఏన్కూర్ మండలం రేపల్లె వాడ పొలాల వైపు తోలుకెళ్లాడు. సాయంత్రం ఇంటికి వస్తున్న సమయంలో ఆవు, దూడ ప్రమాదవశాత్తు ఏన్కూర్ లింక్ కెనాల్‌లో పడిపోయాయి. ప్రవాహ ఉధృతికి కొట్టుకుపోతుండగా రైతులు కెనాల్‌లోకి దిగి దూడను రక్షించారు. ఆవు కొంత దూరం కొట్టుకుపోయి చనిపోయిందని బాధిత రైతు హచ్చా తెలిపాడు. సుమారు రూ 50 వేల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

అనారోగ్యంతో బాలింత మృతి



దుర్గ (ఫైల్)

పినపాక: అనారోగ్యంతో బాలింత మృతి చెందిన ఘటన మండల పరిధిలోని వెంకట్రావుపేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన దుర్రాజు దుర్గ (28) మూడు నెలల క్రితం బాలుడికి జన్మనిచ్చింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె శనివారం రాత్రి నిద్రలోనే మృతి చెందింది. మూడు నెలల వయసులోనే బాలుడు తల్లిని కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

పినపాక: మండలంలోని ఏడూళ్ల బయ్యారం పెద్దవాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఏడూళ్ల బయ్యారం పోలీసులు శనివారం పట్టుకున్నారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

మొదటి కాన్పులో సిజేరియన్

రెండోసారి నార్మల్ డెలివరీ



బిడ్డతో లావణ్య, ఈశ్వరయ్య దంపతులు

ఇల్లెందు: మొదటికాన్పులో సిజేరియన్ జరిగిన ఓ మహిళ వైద్యుల సూచనలు పాటిస్తూ రెండోసారి నార్మల్ డెలివరీ పొందింది. కరకగూడెం మండలం మద్దెలగూడెం గ్రామానికి చెందిన చీమల ఈశ్వరయ్య భార్య లావణ్య రెండో కాన్పు కోసం సుదిమళ్లలోని పుట్టింటికి వచ్చింది. శనివారం పురిటి నొప్పులు రాగా ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. ఆమెను పరీక్షించిన డాక్టర్ ప్రియాంక, స్టాఫ్ నర్సు అనూష తగిన వైద్యసేవలందించి సాధారణ కాన్పు పొందేలా చూశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారు. డాక్టర్, స్టాఫ్ నర్స్‌ను సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్, ఆర్‌ఎంఓ రాంనివాస్, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జి. రవిబాబు అభినందించారు.